# వసంతోదయం X

రచన :
మాస్టర్ రవి, రాజం

"విశాఖని చూస్తే రాత్రేచూడాలి. దాని అందం మరీ విర్రవీగి పోతుందిస్మీ! పగలేం చూస్తాం? భగ్గున మండే ఎండతప్ప!'' అని ఒకనాడన్నతో, గట్టిగా ఆవులించి, వెనువెంటనే, వొళ్లు విరుచుకుని లేచి, అలా చూశాను. అవును నిజంగా విశాఖ రాత్రి ఎంత అందంగా వుంటుందని! పెళ్ళికూతురి ముస్తాబు చేస్తున్నప్పుడు, అందమైన అమ్మాయిలో కలిగే ఆనందం, సిగ్గు దొంతరలు, ఓ చిన్ని గర్వం, మరోప్రక్క వేలాది ఓల్ల పవరుతో మెరిసే కళ్లు.....ఎలా వుంటాయో, అలాగే వుంటుంది విశాఖ! మరచిపోయు, ఆకాశంలో నక్షత్రాలన్నీ, ఎన్నాళ్ళిలా ఇక్కడే చాకిరీ చేస్తామని బాధతో, భూమ్మీదికి చరచరా నడచివచ్చి, చకచకా మిలమిలా మెరసిపోతూన్నట్టుండే, సింధియా లైట్ల కాంతి, రాత్రిలో విశాఖ కెంత శోభ చేకూరుస్తుందని! వాల్తేరునుండి విశాఖకు పోయే రైలుమార్గంతో పోటీపడి, నేటికి తరతరాలుగా, వంశపారంపర్యంగా వస్తూన్న ఎండిన ఉప్పుటేరు, వస్తూన్న దుర్గంధపూరిత సౌరభం, విశాఖకి కాస్త చెడ్డనిస్తున్నా, దొడ్డ ఎక్కువ కాబట్టి, అంతగా ఎంచకూడదుమరి! జీవితంమీద విరక్తిపుట్టినా, "అందం_ ఆనందం - లేదు - లేనేలేదు—'' అనే వ్యక్తులున్నా, సాయంత్రం అయిదు దాటేక, విశాఖ మెయిన్‌రోడ్డు మీదకు పోతే—"బాబోయ్... నేను చావను. సన్యసించను—'' అనే భావాన్ని కలిగిస్తుందంటాడు మా కృష్ణ. నిజంకూడా అంతేనేమో?

మా కృష్ణ, కే. జి. హెచ్. లో అసిస్టెంటుగా చేరి, సరిగ్గా నేటికి మూణ్నెల్లు ఔతుంది. వాడు 'ఎమ్. బి.' థర్డ్ ఇయర్ చదువుతూన్నప్పుడు గాబోలు, నేను విశాఖ ఓసారి వెళ్ళాను. ఆ తర్వాత మరి అవసరంలేక ఆ ప్రాంతాలకి పోనేలేదు.

"ఏవిట్రా! అలా విశాఖ అందాన్నంతా ఆస్వాదించి, జీర్ణం చేసేసుకుంటున్నావ్?...ఇకనైన నిద్రపో..." అన్న కృష్ణమాటలు విని, డాక్టర్ల మాటలు వినకపోతే, రోగాలకు కోపంవచ్చి, దండెత్తుతాయేమోననే భయంతో గబుక్కున కప్పేసుకుని బూచికి భయపడే చంటాడిలా, చటుక్కున కళ్ళు మూసేసుకుని నిద్రాదేవి వడిలో వొరిగిపోయాను.

* * *

"ఒరేయ్! నేను హాస్పటల్‌కు పోతున్నానుగానీ, నీ కాలకృత్యాలు తీర్చుకుని, పది దాటకుండా రా! టి. బి. వార్డులో వుంటాను. హాస్పిటల్ చూస్తానో అని గోలపెడుతున్నావ్! ఆ పని అయిపోయాక నీ బిజినెస్సేదో నువ్వు చూసుకుందువుగాని! ఏం? టిఫిను, కాఫీ టేబిలు మీదుంచాను. ఫినిష్ చేసెయ్. ఇంకేవన్నా కావలిస్తే, ప్యూను ముకుందంగాడు లేడూ..... వాణ్నడుగు!'' అంటూ స్టెతస్కోపు బహు షోగ్గా భుజానవేసుకుని, టకటకా నడిచిపోయాడు కృష్ణ.

ఇక నేను లేవక తప్పలేదు. కృష్ణ...సారీ...డాక్టర్ కృష్ణ మా అన్నయ్య కొడుకు. వాడుంటున్నది సింగిల్‌గానైనా, వాడంటూ అక్కడ వుంటూండగా, నేనింకో చోట దిగుతే ఇంకేమన్నా వుందీ? మాటలనే ఇంజక్షన్స్ దబదబా పొడిచేయడూ? అందుకు, వాడికి శ్రమే అయినా, వాడికోసం, వాడిదగ్గర దిగక తప్పలేదు.

తొమ్మిదీ అయేసరికి, టిప్‌టాప్‌గా తయారై, రూం నుండి బయటపడ్డాను. కలెక్టరాఫీసూ, దాని పరిసర ప్రాంతాలూ నవనవశోభలీనుతున్నై! బస్సులకోసం అలా వెయిట్ చేస్తూన్న కాలేజీకుర్రాళ్ళు, చిలకల్లా రంగు రంగు చీరల్తో, పక్కనేవున్న కుర్రాళ్ళను, ఓరకళ్ళతో తృప్తిగా చూస్తూ, తీరా వాళ్లు తమ పక్క చూడబోయే సరికి, పుసుక్కున ముఖం అటు తిప్పేసే అమ్మాయిలూ, హడావిడిగా ఇటూ అటూ నడిచిపోతూ, సంసార జంఝాటంతో సతమతమయ్యే ఎన్జీవోలు, "మా కాలంలో, మీ కన్నా ఎక్కువ రొమాన్సే వెలగబెట్టామోయ్'' అనే భావాల్ని మనసుల్లోనే వుంచేసుకుని, రంగురంగుల అమ్మాయిల్ని తామూ చూస్తూ, భూతకాలాన్ని నెమరువేసుకునే ముసలిరసికులూ.....నానా గొడవగావుంది ఆ వాతావరణం. తిన్నగా పోస్టాఫీసుకు వెళ్ళి, ఓ కార్డూ, కవరూ కొనుక్కుని, అక్కడినుంచి హాస్పిటల్ చేరుకుని, టీ. బి. వార్డుకు వెళ్ళాను. కృష్ణ

# For 1963

PICTORIAL PHOTO-OFFSET
CALENDARS!
VERY HIGH QUALITY OFFERED
AT RIGHT PRICE:

*PLEASE CONTACT:*

## THE ORIENT LITHO PRESS

**P. B. No. 17 :: SIVAKASI. (S. I.)**

**(CORRESPONDENCE IN ENGLISH)**


మహా బిజీగా, అటూ ఇటూ తిరిగేస్తూ, నన్ను చూడగానే—"అరే! తొందరగా వచ్చేశావే?" అంటూ బోలెడు ఆశ్చర్యపడిపోయాడు. "సరే! వచ్చానుగానీ, మీ వార్డు, మిగతా హాస్పటలూ పూర్తిగా సర్వే చేయించు. ఇంకా నేనలా టౌనులోకి పోయిరావాలి" అన్నానేను. కృష్ణ ఏమీ మాట్లాడలేదు. ముందుకు నడిచాడు. వాణ్ణి అనుసరించాను.

"—ఇది టీ. బి. వార్డు. ఇక్కడ మృత్యువుతో హోరాహోరీ పోట్లాడేవారుంటారు. ఆ కొసనుంచి చూసుకురా! నేనలా రూంలోకి పోయి రెండు నిమిషాల్లో వచ్చేస్తాను" అన్నాడు కృష్ణ.

ఒకొక్క బెడ్డూ అలా చూస్తూ నడుస్తూన్న నాకు, ఎనిమిదవ బెడ్ కొచ్చేసరికి, గుండె ఎందుకో దడదడలాడింది. ఆ బెడ్‌లోని వ్యక్తికేసి, నిశితంగా చూశాను. నిశ్చలంగా పడుకొనివుంది ఆమె! కళ్లు లోతుగానూ, గుంటలు దేరివున్నై. శరీరం పాలిపోయింది. కళ్ళ క్రింద నల్లగా వుంది. దాదాపు శల్యంగావుంది ఆ అమ్మాయ్. ఒక్కసారి నా కళ్ళముందు, గడిచిన నా మధుర జీవితంలో, వసంతాన్ని రేపిన "వసంత" జ్ఞాపకానికి వచ్చింది. 'నిజమా?' అని ఆశ్చర్యపోయాను. ఇంతలో ఓ నర్సు అక్కడకు వచ్చింది. మెల్లగా ఆమె చేయి చూసింది. ఆ స్పర్శతో, ఆమె కళ్లు తెరిచింది. ఏమీ సందేహం లేదు. ఆ అమ్మాయి నిజంగా వసంతే! నా వసంతే!!

"ఇంజక్షన్ తీసుకోవాలి. రెడీ వసంతగారూ! అసిస్టెంట్ వస్తున్నారు" అంది నర్సు.

నర్సులోకి ఓ సారి యాదాలాపంగా చూశాను. తెల్లగా, పాలలా మెరిసిపోతోంది ఆమె. వెంటనే ఆమెకు "పాలబుగ్గల పసిడిచాన" అనే నామకరణం చేసేశాను, ఎవ్వరితోనూ నిమిత్తం లేకుండానే! ఆ చానను చూడగానే, ఎందుకో మా వూరి శారద నాస్మృతిపథంలో మెరిసింది." ఏవిటీ ఆలోచనలు నాకు అని అనిపించినా, నా చేతిలో ఏమీ లేదుగాబట్టి, వాట్నలా వొదిలేశాను. ఇంతలో కృష్ణవచ్చి, ఆ అమ్మా

యికి ఇంజక్షన్ ఇచ్చాడు. బెడ్ పక్కనేవున్న నన్ను అదోలా చూశాడు. నేను నిర్లిప్తంగా, చిన్నగా నవ్వాను. కృష్ణ కాస్త పక్కరాగానే "ఏరా! ఈ అమ్మాయిది ఏవూరు? పేరేమిటి? మరోలా అనుకోకురా నాయనా! నా క్లాస్‌మేట్ ఏమోనని అనుమానంతో అడిగానంతే!" అన్నాను. కృష్ణకూడా చిన్నగా నవ్వి "ఎందుకురా... ఈ అఖ్ఖర్లేని ఇన్‌ఫర్మేషన్? అయినా, ఆ అమ్మాయి పేరు వసంత రాజమండ్రినుండి వచ్చింది. తండ్రి ఏదో ఫర్మ్‌లో పార్ట్నర్‌ట కాస్త వున్నవారే! ఇక చాలా వివరాలు?" అన్నాడు.

ఆ మాట వినగానే, నా అనుమానం నిజమైందనే విజయోత్సాహం వెల్లివిరిసింది. "ఆ అమ్మాయితో మాట్లాడవచ్చా?" అన్నాను ఆత్రంగా!" నిజానికి వీల్లేదనుకో! అయినా, నా మనిషివి గాబట్టి ఛాన్సిచ్చాను ఫో—" అని కృష్ణ, మరో బెడ్ వద్దకు నడిచాడు.

నేను మెల్లగా వసంత దగ్గరగావచ్చి, ముందున్న స్టూలు లాక్కుని "నమస్తే! గుర్తున్నానా?" అన్నాను. నర్సు నావేపు చూసింది. నేను వసంతవేపు చూశాను. వసంత నన్నాశ్చర్యంగా చూస్తూ, అదోలాముఖం పెట్టి "మీరూ...మీరు సూర్యంకదూ?" అంది. నాలో క్రొత్తకాంతి ప్రవేశించింది. నర్సు, వసంతకు మందు త్రాగమని ఇచ్చి, అక్కడినుండి నిష్క్రమించింది. అక్కడ కొంత కాంతి తగ్గిందేమోననీ, కాస్త చీకటి ప్రవేశించిందేమోననీ భ్రమపడ్డాన్నేను. ఆ 'పాలబుగ్గల పసిడిచాన' అంతలా ప్రకాశించిపోతోంది మరి!

"వసంతా! ఏవిటిది? ఇక్కడున్నావేమిటి?" అన్నాను.

"ఔను సూర్యం! ఇప్పుడు నేను జీవితంతో పోరాడుతున్నాను. నేను నా జీవితంలో ఏ ఒక్కరికీ ఆనందాన్ని, సౌఖ్యాన్ని ప్రసాదించకపోగా, నామట్టుకు నేనేనా కులాసాగా లేకపోయాను. దాదాపు ఆరు నెలలనుండి నేనీవ్యాధినుండి బాధపడుతున్నాను. మదనపల్లెకే తీసుకవెడతానన్నారు నాన్న కానీ, ఎందుకో ఈ విశాఖ కే. జి. హెచ్. అంటేనే నాకు పూర్తి నమ్మకం. అందుకే ఇక్కడకు వచ్చాను. దేవుని దయవల్ల, మరో ఆరు నెలలలోగా, నేను పూర్తి ఆరోగ్యాన్ని పొందగలనని డాక్టర్లంటున్నారు. నేనుకూడా కొంత రిలీఫ్ ఫీలవుతున్నాను—" ఇంతలో దగ్గుతెర వసంత నావరించింది. కొన్ని క్షణాలు బాధగా మూలిగి, కళ్ళల్లో ఎందుకో నిలిచిన సంద్రాన్ని తుడిచేసుకుని "సూర్యం! ఇప్పుడెక్కడ వుంటున్నావ్? ఏం చేస్తున్నావ్?" అంది వసంత. ఆ మాటల్లో ఎన్ని అఘాతాలున్నాయని! ఎంత బాధ తొంగి చూసిందని!!

"వసంతా! మీనాన్న అలా అన్న తర్వాత, నేను శ్రీకాకుళం వచ్చేశాను. అక్కడే ప్రస్తుతం వ్యాపారం చేస్తున్నాను. ఆనాటి రోజుల బూజుల్ని దులపలేక, ఆ ఆనందానికి నోచుకోక, ఏదోగా జీవిస్తున్నాను వసంతా...ఏదో జీవిస్తున్నాను. ఆఁ...నా సంగతి కేంగాని, మీ నాన్నగారు వచ్చారా? ఇప్పుడిక్కడ నీకు సంరక్షణ ఎవరు చేస్తున్నారు?" అన్నాను.

"మా నాన్న రాలేదు. మా అమ్మమాత్రం వచ్చింది. ఇక్కడకు దగ్గరగా ఓ రూము తీసుకుని వుంటోంది. వంటా గట్రా చేసి మరోగంటలో వస్తుంది" అంది వసంత.

"ఆహాఁ......అమ్మగారు వచ్చారన్నమాట! తిరిగి సాయంత్రం కలుస్తాను. ఏం బెంగపడకు వసంతా! అన్నిటికీ ఆ భగవంతుడే వున్నాడు. మనసులో గత స్మృతులకు తావిచ్చి మథనపడకు. మళ్ళీ వస్తానూఁ—" అంటూ, కృష్ణతోకూడా చెప్పి వాడి రూం చేరుకున్నాను.

* * *

ఇంకా ఏవేవో పనులు చేద్దామనుకున్న నాకు, వసంతను అనుకోకుండా చూడగానే, మతిపోయినట్టెయింది. ఏ పనికీ మనసొప్పలేదు. అప్పటికప్పుడే కేరియర్ తెచ్చేసిన ముకుందాన్ని, కాసిన్ని నీళ్ళందుకోమని చెప్పి, కారియర్ ఫినిష్ చేసి, వాలుకుర్చీలో మేను వాల్చాను. సిగరెట్టు తాగాలనిపించింది చాలా కాలానికి. ఏనాడైతే, రాజమండ్రీలో, వసంతతో విడిపోయానో, ఆ నాటినుండే వసంతతోపాటు సిగరెట్‌నుకూడా వదిలేశాను. మళ్ళీ నాటికి నేడు వసంతతోబాటు, సిగరెట్టుకూడా జ్ఞాపకానికొచ్చింది. విధిలేక, మా కిష్టిగాడి పేకెట్‌నుండి ఒకటి తీసి వెలిగించాను. పాత స్మృతుల పరదా మెలమెల్లగా నన్నావరించింది. కళ్ళు మూసుకున్నాను.

అవి రాజమండ్రీలో నేను బి. ఎ. చదువుతూన్న రోజులు. వసంత నా క్లాస్‌మేట్ కల్చరల్ ఎసోషియేషన్‌కు సెక్రటరీ కూడా! ఒకరోజు గాబోలు కాలేజ్ డే సెలబ్రేషన్స్‌కు "స్త్రీలు - సమాన హక్కులు" అనే విషయమై చర్చ ప్రారంభమైంది. ఒక్కొక్కరూ, ఒకొక్కరకంగా చెప్పారు. వసంత లేచి డయస్ సమీపిస్తోంది. నా పక్కనే కూర్చున్న ఈశ్వర "పాము...పాము" అన్నాడు నాతో! నేను తృళ్ళిప ఇటూ అటూ చూశాను. "ఓరి వెర్రి నాగన్నా! పాముని ఇటూ అటూ చూస్తే ఎక్కడుంటుందిరా! వసంత వెళ్ళింది చూడూ......ఎలా బుసలు కొడుతోందో...?" అన్నాడు. 'అంతేకదా' అనుకున్నాను.

ఇక వసంత డయస్ నుంచి, స్త్రీల సమాన హక్కుల గూర్చి దంచేస్తోంది. "ఇవి కావాలనీ, అవి లేవనీ, మగవాళ్ళకంటె, ఆడవాళ్ళకే, అనేకవిషయాల్లో, అనేకం ఎక్కువ వున్నాయనీ, అయినప్పటికీ మనదేశం ఇంకా స్త్రీకి సమానహక్కు ఇవ్వటంలేదనీ, ఝాన్సీ లక్ష్మీబాయి సాహసం దగ్గరనుండి, వాళ్ళ బామ్మ అర్ధరాత్రి లేచి పెరట్లో నూతివద్దకు వెళ్ళే సాహసం వరకూ గడగడా చెప్పేసింది. అంతా దడదడా చప్పట్లు కొట్టేశారు. అప్పుడు వసంతను పర్టిక్యులర్‌గా చూశాను. బాపూగీసిన బొమ్మలా, అజంతా శిల్పపు అవయవాల అమరికతో, సన్నగా, పొడుగ్గా, అందంగా న్యూ బిన్నీ సేరీలో వసంత, 'భేష్' అనిపిస్తోంది. అంతా పొట్సు కొడుతూంటే, వసంత చిన్నగా నవ్వింది. ఎర్రటి లిప్‌స్టిక్ అవుసరంలేని పెదాలమధ్య, తెల్లగా మిలమిలా మెరిసే పళ్లు ఎంతో శోభను కలుగజేశాయ్ వసంతకు. నిజంగా బినాకా కాంపిటేషన్‌కు వెళ్తే ఫస్ట్ వస్తుందనే నమ్మకం నాకుండి, పక్కనున్న ఈశ్వరంతో అనేశాను కూడా!

వసంత డయస్ దిగి వస్తోంటే, నేను డయస్ కోసం వెళ్తూ, అనుకోకుండా ఆమెకు డాష్ ఇచ్చాను. వసంత చిరుకోపాన్ని ముఖంలోకి తెచ్చుకుని "ఆడవాళ్లొస్తూంటే ఆ మాత్రం చూసుకోరూ" అంది. కోపంలో కూడా వసంత అంత బావుంటుందని, అప్పుడు తెలిసిందినాకు. "అదేవిటండీ? 'ఆడ' అంటూ ప్రత్యేకంగా అంటున్నారు? ఇప్పుడేకదా మీరు సమానహక్కులగూర్చి పోట్లాడింది. మగాళ్ళతో సమాన హక్కులగూర్చి పోట్లాడి, అనుకోకుండా ఆ మాత్రం డాష్ ఇచ్చిందానికి అంత మథనపడతారేం? ఇలా అయితే మీకు సమాన హక్కులెలావస్తాయ్?" అన్నాను నేను విజయగర్వంతో! వసంత ముఖం సంతలో కళ్ళినట్లు చిన్నబోయింది. అంతా గొల్లుమన్నారు.

CEYLON DIAMONDS TIRUCHI
దక్షిణాఫ్రికాలోఉండే 'కింబర్లి' వజ్రాల ఉత్పత్తికి ప్రసిద్ధిచెందినది!
భారతదేశములో కల్చరల్ వజ్రాలుకు ప్రసిద్ధి చెందినది "కింబర్లి"
సిలోన్ మార్కు
"కింబర్లి" వజ్రములు
తయారించువారు
CEYLON DIAMONDS
NO.4. CHUNNAMBUKARA STREET,
TIRUCHIRAPALLI—8
సిలోన్ డైమండ్స్
నెం.4. చున్నాంబుకార వీధి.
తిరుచురాపల్లి—8

ఆ సాయంత్రం, అలా గోదావరితీరానికి షికారుకు పోయాను. చల్లని పిల్లతెమ్మెరలు, మనోల్లాసాన్ని కలిగిస్తున్నాయ్. దూరదూరంగా, మనుష్యులు అలాఅలా కదిలిపోతున్నారు. ఇసుకలో రెండు చేతులూ వెనక్కు ఆనించి, తల పైకెత్తి ఆకాశాన్ని చూస్తున్నాను. ఇంతలో కారు హారన్ ఏదో, నా ప్రశాంతతను భంగపరచింది. అటు తిరిగి చూశాను. అవును! నిజంగా ఆ అమ్మాయి వసంతే! వైట్ సిల్కు వాయిల్‌లో ఆమె మీరాబాయిని గుర్తుకుతెస్తోంది. గాలికి, ఆమె ముంగురులు, ముఖాన్ని ముద్దెటుకుంటున్నాయ్. నాలో ఏవో-ఏవేవో తెలియని తీయని భావాలు బాధగా కలిగాయ్. ఆమె, నాపక్కనుండే నడచి ముందుకు సాగిపోతోంటే "వసంత గారూ! ఇలా కూర్చోకూడదూ? ప్రశాంతంగా వుందిక్కడ......ఇఫ్ యూ డోంట్ మైండ్—" అన్నాను. వసంత చిన్నగా నవ్వింది వచ్చి నాకొంచెం దూరంలో కూర్చుంది. ఇసుకలో వెండినీరు ఒలకబోసినట్లుండా ప్రదేశంలో, వసంత కూర్చోగానే!

ఇద్దరి మధ్యా, నిశ్శబ్దం ఓ రెండు నిముషాలుంది. నేనే చొరవచేసి "వసంతగారూ! మీ నాన్నగారేం చేస్తున్నారు? మీకు బ్రదర్స్ ఎవరైనావున్నారా?" అన్నాను. ఆమె చెప్పింది. తానొక్కతే సంతానమని! పైగా వాళ్లు బాగా వున్నవాళ్లు. "మొన్న మీ డిబేట్ చాలా బావుందిస్మండీ! ఝాన్సీ లక్ష్మీబాయి సాహసం కంటే, మీ బామ్మగారి అర్ధరాత్రి సాహసం ఎంతో ఆశ్చర్యంగా వుంది." అని నేననేసరికి వసంత విరగబడి నవ్వింది. అపుడామెలో వివిధావయాల విన్యాసం నన్నుద్రేకపరిచింది. కలకత్తా చేపపిల్లలా, పొడవాటి జుత్తుని రెండుగా పాయలుచేసి, రెండు జడలు వేసుకుంది. గంగానది పాయల్లా అవెంతో అందంగా వున్నాయ్. అట్టహాసంలేకుండా, చెవులకు సింపిల్‌గా వున్న ఆ రింగులు...అబ్బ...చాలా బావున్నై...కొంతసేపు లోకాభిరామాయణమైనాక, మే మిద్దరం విడిపోయాం. వచ్చే ఆదివారం తన పుట్టిన రోజని, పార్టీకి రమ్మనీ ఆహ్వానించింది వసంత. నేనుక్కిరి బిక్కిరై పోయాను. ఇక ఆ రోజునుంచీ, రోజూ కాలేజీలో, వసంత, నాతో మాట్లాడాలని ఉవ్విళ్ళూరేది. ఏదో మిషతో, నాతో పరిచయం ఎక్కువ చేసుకునేది. ఆదివారంకోసం ఓ చక్కని బహుమానాన్ని గడీ చేశాను. "రీడర్స్ డైజెస్ట్"కు సంవత్సరచందా వసంత పేర కట్టేసి, ఆ రశీదు ఆమెకు బహుమతిగా ఇచ్చాను. అన్నిటికన్నా వసంత, నా బహుమతికి ఎంతో విలువనిచ్చి ఆనందించింది. వాళ్ళ నాన్నగారికి నన్ను పరిచయం చేసింది. వీలున్నప్పుడల్లా వసంత ఇంటికెళ్తూండేవాడ్ని. రాన్రాను మా పరిచయం ప్రేమగా మారింది. కాలేజీ వదలగానే, రోజూ ఇద్దరంకలిసి, కనీసం ఓ గంటైనా, గోదావరి తీరాన ఆనందించేవాళ్ళం. మాలో ఏవేవో అనుభూతుల ప్రవాహాలు కలిగేవి. తీయని భావాలు మెదిలేవి. రోజుకో రీతిగా, వసంత అలంకరించుకుని, నన్నానందింపజేసేది. ఆడవాళ్ల సన్నిధిలో ఇంతటి మహదానందం వుంటుందని అప్పటికిగాని నాకు తెలీలేదు.

మా పరిచయం సంగతి వసంత నాన్నగారికి ఎలాగో తెలిసిపోయింది. ఓ రోజు, నేను వాళ్ళింటికి వెళ్ళినప్పుడు, ఆయన నాతో ఇలా అన్నారు "మిస్టర్ సూర్యం! నువ్వు తెలివైనవాడివి. లోకం సంగతి బాగా తెలిసినవాడివి. ఇక నువ్వు మా అమ్మాయితో పరిచయం మానుకుంటే బాగుంటుంది. మన మనసులు మంచివైనా, లోకాన్ని నమ్మించలేం. అయినా, మీకూ మాకూ ఎటూ పొందుకుదరని పరిస్థితిలో ఎటువంటి ఆలోచనలకూ తావివ్వడం మర్యాదగాదు. మా అమ్మాయి అతి గారాబంగా పెరిగింది. ఎండ కన్నెరుగని అమాయిక ఇక మీ పరిస్థితి, ఆర్థిక స్థితి మీ రెరుగనిదికాదు...ఇలా అన్నానని వేరేగా తలచకు..."

ఆమాట విని, నిలువునా స్థంభించిపోయాను. ఆయన్ని ఎదిరించే ధైర్యం నాలో కరువైంది. ఏమీ చెయ్యలేకపోయాను. వసంత ఈ మాటలు విని చాలా కుమిలిపోయింది. కానీ ఆమెమాత్రం ఏం చెయ్యగలదు? ఇది 'భారతదేశం' అని ఆమెకూ తెలుసు. "ధర్మారావు గారూ! మీ మాటల్లో అంతర్యాన్ని గ్రహించలేని పసివాణ్నిగాను. కానీ, నేను వసంతను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. ఇది ఇరవయ్యో శతాబ్దం భావాలనీ, ఆదర్శాలనీ, ముందడుగనీ—ఏవేవో కేవలం మీటింగుల్లో బల్లగుద్ది చెప్పడానికి సరిపోయే యుగమనీ, నేనీనాడు గ్రహించగలిగాను. ఆర్థికస్థితివల్లనే, నేడు సమా


జంలో, మానవుడికి గౌరవమర్యాదలు కలుగుతున్నాయని నేటికి గ్రహించగల్గాను. ఎటువంటి పరిస్థితిలోనూ వసంతను మరువలేను'' అంటూ, నే నక్కడనుండి నిష్క్రమించాను. అంతే! నాటినుండీ వసంతను తప్పించుకు తిరిగేవాణ్ని. ఆ తర్వాత బి. ఎ. పట్టా తీసుకోవటం, పరిస్థితుల ప్రభావంవల్ల శ్రీకాకుళం వచ్చేయటం జరిగిపోయింది—'' ''ఒరేయ్! నిద్రేనా?'' అని కృష్ణ నన్ను లేపేవరకూ, వర్తమానంలోకి రాలేకపోయాను.

*　　*　　*

సాయంత్రం కృష్ణప్రమేయం లేకుండానే, హాస్పిటల్‌కు వెళ్ళి, వసంతను కలుసుకున్నాను. ఆ ''పా.బు.ప.చా'' వసంతకు ఏదో డైట్ ఇస్తోంది. తిరిగి నా స్మృతిపథంలో 'శారద' మెరిసింది. ఆమెలోకి చూశాను. పాలలో పంచదార కలిసిపోయినట్లు; తెల్లని తెలుపు శరీరంలో అతి తెల్లని గౌను మిళితమైపోయింది. ''డాక్టర్లనీ, నర్సులనీ చూస్తేనే రోగుల రోగాలు పారిపోవాలి'' అని ఓనాడన్న మా కృష్ణమాటలు నిజమని ఇప్పుడు తెలిసింది నాకు. ఆ ''పా.బు.ప.చా'' నవ్వితే, వేయిమల్లెలు విరిసినట్టయింది అక్కడ. స్టూలు లాక్కొని వసంత దగ్గరగా కూర్చున్నాను. చేతిలో, అప్పుడే కొన్న ఏపిల్స్, బత్తాయి, ద్రాక్ష వసంత చేతికిచ్చాను. వాటిని ఆ ''పా. బు. ప. చా'' చూస్తూ—

''మిస్ వసంతా! అవి తినకూడదు సుమండీ! అసిస్టెంట్ గారి నడిగి మరీ తీసుకోండి'' అంది. ''అమ్మ బాబోయ్! ఈ ''పాబుపచా'' తక్కువదికాదురోయ్'' అనుకుని, ఆమెవేపు చూసి—'జిస్ దేశ్ మే...' లో రాజ్‌లా నవ్వేశాను. ఆమె అది అందుకని, అక్కడి నుండి వెళ్ళిపోయింది. 'చీకటైపోయింది' అని గొణిగి వసంతవేపు చూశాను. ఆమె ముఖం వివిధభావాల్ని ప్రదర్శిస్తోంది. నన్నేవో అడగాలని ఆమె ఉవ్విళ్ళూరింది. కానీ, యేదీ అడగలేకపోయింది. ఇంతలో ఓ మధ్యవయస్కురాలక్కడకువచ్చి 'వసంతా!' అంది. ఆమె వసంత తల్లిగారు. ''అమ్మా! ఈయన సూర్యంగారని... నా క్లాస్‌మేట్. ఈయన్ది మన రాజమండ్రీనే! ఇవన్నీ


నాణ్యమునకూ...
అందమునకూ పేరొందినది !!




వీనస్ బనియన్లు చాలకాలము మన్నును.
ధరించుటకు హాయి నిచ్చును.

తెచ్చారు'' అంది వసంత చేతిలో పళ్ళను చూపుతూ! ముసలామె కృతజ్ఞత సూచించింది.

* * *

ఆతర్వాత ఇంకా అక్కడ వారంరోజులు వున్నాను. రోజుకు కనీసం రెండుసార్లైనా వసంతని చూడ్డానికి వెళ్ళేవాడిని. ఆమెతోపాటు ఆ ''పా.బు.ప.చా'' ని కూడా చూశేవాణ్ని. రోజురోజుకూ వసంతలో ఆరోగ్యం కాస్త కాస్తగా బాగు కాజొచ్చింది. ముసలామె నా అభిమానానికి యెంతో ఆనందించేది. వసంతవద్దా, మా కృష్ణవద్ద, ఆ 'పా.బు.ప.చా' వద్దా (అవసరం లేకపోయినా—) శెలవుతీసుకుని, మావూరు చేరుకున్నాను. వచ్చానే గాని, నా మనస్సంతా హాస్పిటల్ మీదే వుంది.

భోజనాల సమయంలో గాబోలు, అమ్మ అంది నాతో: ''విన్నావురా! మన సుందరం కూతురు శారదకు టైఫాయిడు వచ్చిందట. పాపం వాళ్లు చాలా బెంగపడిపోతున్నారు. సాయంత్రం ఓసారి వెళ్ళి చూసిరా''. అసలే వసంత పరిస్థితికి మొద్దుబారిన నా నరాలు, శారద వివరం వినగానే కృంగిపోయాయ్. ఏవో నాలుగు మెతుకులు కతికి పక్కజేరాను.

శారద అందమైన చిన్నది. ఇరవై ఏళ్లుంటాయ్. బొద్దుగా, పొట్టిగా, నిగనిగలాడే నిమ్మపండులా, పచ్చగా వుంటుంది. వడ్డాది పాపయ్య బొమ్మలు గుర్తుకువస్తాయ్ శారదను చూస్తే! సుందరంగారికి, శారదను నాకిచ్చి చెయ్యాలని ఆశ! అమ్మకుకూడా అదే ఇష్టం. సంసార పక్షంగా, లక్ష్మీకళతో గునగున నడిచే శారదంటే నాకూ ఇష్టమే! ''వసంతతోనే నా జీవిత మధుర క్షణాలు మాయమైనాయ్. నాకు వసంతమే దూరమైంది—'' అని విచారించే నాకు, శారదతో పరిచయం కాస్త హాయినిచ్చింది. శారదను వివాహం చేసుకుందామనే నిర్ణయానికి వచ్చాను. రెండునెలల్లో ముహూర్తాలున్నాయి. వాళ్ళంతా అప్పుడే హడావుడిలో పడిపోయారు. మధ్యలో ''శారదకేవిటిప్పుడు ఇలావుంది? హే భగవాన్! నేను మనస్ఫూర్తిగా వాంఛించే వ్యక్తులు నాకిక దక్కరా? నాకా అదృష్టం లేదా? నేనేం పాపంచేశానని ప్రభూ—నాకీ శిక్ష? వసంత అలా దక్కకుండా పోయింది. ఇక శారదనుకూడా దూరం చేస్తావా?'' అనుకుంటూ అలా కళ్ళుమూసాను.

విశాఖ ఆసుపత్రిలో ఆ పాలబుగ్గల పసిడిచాన కళ్ళముందు మెదిలింది. ఆమెను చూస్తే శారదను చూడక్కరలేదు. హాస్పిటల్ జ్ఞాపకానికి రాగానే—''శారదను కే. జి. హెచ్‌కు తీసుకువెడితే—'' అని అనిపించింది. మరి నిద్రపట్టలేదు. తలంతా గజిబిజి అయిన ఆలోచనలతో నిండిపోయింది. లేచాను. డ్రెస్ వేసుకుని, గబగబా సుందరంగారింటికి వెళ్ళాను. శారద నైరాశ్యంగా మంచంమీద పడుకుంది. చాలా చిక్కిపోయింది. సుందరం దంపతులు నన్నుచూసి కళ్ళు తుడుచుకున్నారు. వారి పరిస్థితికి, నాకూ విచారం కలిగింది. ''అమ్మ చెప్పింది. ఏం బాధలేదు. విశాఖ తీసికెడితే?'' అన్నాను. సుందరంగారు ''ఈ పరిస్థితిలో యెలా తీసుకెళ్ళడం? అయినా డాక్టర్లంత అపాయం లేదు, ఇక్కడే నయమైపోతుందన్నారు—'' అన్నారు.

మాట్లాడుతూంటే, శారద మెల్లగా కళ్ళు తెరిచింది. నన్ను చూసింది. ఆమె కళ్ళు అశ్రుపూరితాలైనాయ్.

''భయపడకు శారదా! తొందరగా కోలుకుంటావుగా'' అన్నాను.

* * *

వారంరోజులు గడిచాయ్. శారద పరిస్థితి, రోజురోజుకూ విషమిస్తోంది. డాక్టర్లుమాత్రం ఇంకా బాధలేదనే చెప్తున్నారు. మా కృష్ణకు తంతి ఇద్దామనుకున్నాను. అలాగే ఇచ్చేశానుకూడా! సాయంత్రానికల్లా పాపం వాడొచ్చేశాడు. ఏదో ఇంజక్షన్ ఇచ్చాడు. ఈ రాత్రి గడిస్తే మరి ఫరవాలేదన్నాడు. నాలో, నిమిష నిమిషానికీ పిరికితనం ఎక్కువ కాసాగింది. ''ఏమిట్రా నువ్వు? చిన్నపిల్లాడిలా! డాక్టర్లు చెయ్యతగినంత సహాయం చేస్తున్నారు. నువ్విలా బేలవైతే ఎలా మరి? కానీ ఒక్కటే ... డాక్టర్లు మందు లివ్వగలరు గానీ — ప్రాణాలు పోయలేరు గదా—'' అంటూ తేల్చేశాడు. ఇంతలో, శారద తమ్ముడు గోపీ పరుగుపరుగున వచ్చి, నన్ను చూసి బావురుమన్నాడు. ''ఏం? ఎలావుంది?'' అన్నాన్నేను. వాడేం చెప్పలేదు. ఏకధారగా ఏడుస్తున్నాడు. నాలో సహనం నశించింది. ధైర్యం పారిపోయింది. కృష్ణతోసహా, పరుగున శారద ఇంటిని చేరాను, కానీ...కానీ...ఏం లాభం? దీపం ఆరిపోయింది! నా భావిజీవిత జీవనజ్యోతి ఆరిపోయింద...గాలిలో కలిసి

పోయింది!! 'హే భగవాన్' అనుకుంటూ గుడ్డ నోట్లో కుక్కుకున్నాను. మా కృష్ణకూడా కళ్లు తుడుచుకుంటూ "వూర్కో! మానవుల చేతిలో ఏమీ లేదు—" అంటూ నా భుజం తట్టాడు.

* * *

నా జీవితంలో జరుగుతూన్న విచిత్ర పరిణామాల్ని, భగవంతుడు నాపై తీర్చుకుంటూన్న కసినీ, మానవుడి అసహాయస్థితినీ, తలుచుకుని, బాధగా మూలుగుతూంటే, మూణ్ణెల్లు గడిచాయ్. చెదిరిపోయిన నా హృదయాన్ని చక్కబెట్టుకుందుకు ఓసారి విశాఖవెళ్తే బావున్ననిపించి, బయలుదేరాను.

ఈసారి మాకృష్ణ నన్నెంతో ఇదిగా చూసుకున్నాడు. నా హృదయానికి తగిలిన గాయం తనదిగా భావించి బాధపడ్డాడు. 'వసంత' కెలా వుందని అడిగాను. "ఆమెకేం? అదృష్టవంతురాలు. బాగా కోలుకుంటోంది" అన్నాడు డాక్టర్ కృష్ణ. భగవంతుడు ఆమెనైనా ఒకింత ఆదరంతో చూస్తున్నందుకు ఆనందించాను.

సాయంత్రం హాస్పటల్‌కు వెళ్ళాను. వసంతను చూశాను. ఎంత ఇంప్రూవ్‌మెంట్ కనిపించిందని! చాలా బాగా కోలుకుంటోంది. ఆమె ముఖంలో తృప్తి-ఆనందం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నై! నన్ను చూసి, హాయిగా నవ్వి, తనే స్టూలు జరిపింది కూర్చోమని చెప్తూ. కూర్చున్నాను. వాళ్ళ నాన్నగారుకూడా వచ్చారని చెప్పింది మాటల్లో వసంత. అయితే నేనిక వెళ్ళొస్తానని లేవబోయాను. వసంత నా చేతిని పట్టుకుని ఆపేసింది. నాలో ఏదో కొత్తరక్తం ఊరకవేసింది. "అబ్బ! ఎన్నే(న్నా)ళ్ళ తర్వాత తిరిగి వసంత కరస్పర్శ అనుభవించాను" అనుకుంటూ కూర్చున్నాను. "సూర్యం! ఏమీ బాధలేదు. మునుపటి నాన్ననుకున్నావా? ఇప్పుడు పూర్తిగా మారిపోయాడు. ఆ మార్పుకి కారణమేమిటో తెలీదు కానీ ... అంతక్రితం నీవిలా వచ్చావని చెపితే 'ఏవిటీ - సూర్యం వచ్చాడా? ఈసారొస్తే తప్పక కలుసుకోవాలి' అన్నాడు తెల్సా? నీవంటే ఇప్పుడెంత ఆపేక్షనీ ఆయనకు!" అంది.

ఇంతలో మాకృష్ణ వచ్చి వాడి రూంలోకి రమ్మన్నాడు. వెళ్లాను. అప్పుడు చెప్పాడు—"ఏరా! వీళ్లతో నీ పరిచయమే చెప్పాన్ కావ్! ధర్మారావుగారు నీకు ముందే తెల్సటగా! ఆయనే ఇందాకంతా చెప్పారు. పాపం! ఇక వసంతకు పెళ్ళవడం కష్టమేగా! నిజానికామె ఇప్పటికే పరిపూర్ణ ఆరోగ్య అయింది. కానీ—ఈ లోకంవుంది చూశావ్...ఒప్పుకోదుగా! "ఆ క్షయ పిల్లకా! మాకొద్దు బాబోయ్" అంటుంది. ఆ బెంగతో పాపం ధర్మారావుగారు మనిషి ఇలా అయిపోయాడు. ఇప్పుడుగాని నువ్వు "ఊ" అంటే, ఆయన ఎగిరి గంతేస్తాడు. మరోనెల విశ్రాంతిమీద వసంతను డిస్చార్జ్ చేస్తాం. ఆమెకే జబ్బూ లేదని, ఇకముందు రాదనికూడా, కావలిస్తే నీకు నేను రాసిస్తాను. నీ కిష్టంవుంటే దర్జాగా చేసుకోవచ్చు" అన్నాడు.

నాలో ఏదో నిర్లిప్తమైన భావం కలిగింది. ఇద్దరం లేచి, మెల్లగా వసంత బెడ్‌ను సమీపించాం. ధర్మారావుగారు అప్పుడే వచ్చి కూర్చున్నవారు, మమ్మల్ని చూస్తూ గబుక్కున లేచి "హలో! సూర్యం...కులాసాగా వున్నావా? చాలా రోజులైంది నిన్ను చూసి. మా వసంతకు చాలా హెల్ప్ చేశావటగా! థాంక్సోయ్" అన్నారాయన.

ఆయనలో కలిగిన ఈ భావాలకీ, పరివర్తనకు నాకాశ్చర్యమేసింది. మెల్లగా నవ్వానంతే! ధర్మారావుగారు నాదగ్గరగావచ్చి "సూర్యం-ఆనాడేదో అన్నానని మనసులో బాధపడకు. అలా అన్నందుకు నన్ను క్షమించు. అన్నీ తెలిసిన నీకు వేరేగా చెప్పనవసరం లేదనుకో! ఈ ప్రపంచంలో మనష్యులకు కావల్సింది ఒక్క డబ్బే అనుకున్నాను. కాదు అదికాక ఇంకా ఎన్నో...ఎంతో...ఎంత డబ్బుతోనైనా కొనలేని వెన్నో వుంటాయని, అవికూడా కావాలని తెలుసుకున్నాను. నీ కభ్యంతరం లేకపోతే......" మరి చెప్పలేక గాద్గదికంగా వూరుకున్నారు ఆయన.

వసంతవేపు చూశాను. నా వేపు కృష్ణచూశాడు. కృష్ణవేపు ధర్మారావుగారు చూశారు. వసంత సిగ్గుతో, చేతుల్తో ముఖం కప్పుకుంది. ఇంతలో అక్కడికి ఆ పాలబుగ్గల పసిడిచాన' వచ్చి, ముఖాన్న పెట్టుకున్న చేతులుతీసి, పాలు తాగమంది వసంతతో! వసంత లేచి, ఆ పాలు గడగడా తాగుతోంది. ఆ 'పాబుపచా'ని చూడగానే, నానుండి దూరమైన 'శారద' నాస్మృతిపథంలో మెరిసింది. అప్రయత్నంగా నా కళ్ళలో నీళ్లు తిరిగాయ్. అవి మెల్లగా జారి నేలనానాయ్. వసంత పాలు త్రాగేసి గ్లాసు బల్లమీద వుంచేసింది. ధర్మారావుగారు, వసంత, పా. బు. ప. చా, కృష్ణ అంతా ఒక్కసారిగా నా వంక చూశారు. ఆ బాష్పాలనుచూసి, వారు ఆనంద బాష్పాలనుకున్నారు. కానీ, అవి ఆనంద బాష్పాలో - దుఃఖాశ్రువులో నాకు తప్ప ఎవరికి తెలుసుంది?